క్లుప్తంగా

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్



ఆమనగల్లు: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ హెచ్చరించారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గుడుంబా రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా నాటుసారా, గుడుంబా తయారు కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాలు, తండాలలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. అలాగే నాటు సారా తయారీకి అవసరమైన బెల్లం, ఇతర ముడి సరుకులు ఎవరైనా విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కళాశాల సమస్యను పరిష్కరించండి



ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందిస్తున్న కేశవులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భూ సమస్యను పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అభ్యర్థించారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో బుధవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణంలో జూనియర్ కళాశాల భూ వివాదం కారణంగా భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.


హోంగార్డ్ కుటుంబానికి ఆర్థికసాయం



వెంకటేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో ఛాతిలో నొప్పితో మృతి చెందిన హోంగార్డ్ వెంకటేశ్ కుటుంబ సభ్యులకు బుధవారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థికసాయం చేశారు. గునుగల్ గ్రామంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వెంకటేశ్ చిత్రపటం వద్ద పూల మాల లేసి నివాళులర్పించారు. అనంతరం రూ.70 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో సైతం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యాచారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఇబ్రహీంపట్నం: స్థానికంగా ఉన్న శ్రీ సాయిరాంనగర్ కాలనీ బంగారు మైసమ్మ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా నందికొండ రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఎంపల్ల గోవర్ధన్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా ఆకుల సురేష్, ఏనుగు బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంగనమోని సత్యనారాయణ, కోశాధికారిగా కండె నరేష్‌గుప్తా, ఉపాధ్యక్షులుగా దండేటికార్ జ్ఞానేశ్వర్, జుట్టు సతీష్, పందాల దేవందర్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా ఆక్కెనపల్లి శ్రీరాములు, ప్రచార కార్యదర్శిగా మాద్గుల శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా తదితరులు ఎన్నుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని కొత్తగా ఎన్నికైన కార్యవర్గం ప్రకటించింది.

పనుల పరిశీలన

మాడ్గుల: మండల కేంద్రంలోని చేపట్టిన నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పరిశీలించారు. మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు వడపోసి.. అర్హులను గుర్తించి

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై అధికారుల కసరత్తు
- ఎదురుచూస్తున్న ఆశావహులు



లింగంపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు

మంచాల: ఇల్లు లేని నిరుపేదల కళ్లన్నీ ప్రభుత్వం వైపే చూస్తున్నాయి. పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర సర్కారు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇదివరకే గ్రామాల్లో సర్వే సైతం పూర్తయింది. ఎప్పుడు తుది జాబితా సిద్ధమవుతుందని లబ్ధిదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. మంచాల మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఇళ్ల కోసం 12,104 దరఖాస్తులు వచ్చాయి. వాటిని మూడు కేటగిరీలుగా విభజించారు. ఎల్-1(సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారు)-3,680, ఎల్-2(స్థలం, ఇల్లు లేని వారు)-862, ఎల్-3(అద్దె ఇల్లు లేదా రేకుల ఇంట్లో ఉండేవారు)-7,562 అర్జీలు వచ్చాయి. ఇందులో నుంచి అసలైన అర్హులను ఎంపిక చేయడం అధికారులు పెను సవాల్‌గా మారింది.

500 ఇళ్లు మంజూరు

ప్రస్తుతం మండలానికి దాదాపు 500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిని జనాభా ప్రతిపాదిక ప్రకారం గ్రామాల వారీగా విభజించినట్లు విశ్వసనీయ సమాచారం. లింగంపల్లిని ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలెట్ గ్రామంగా తీసుకున్నారు. అక్కడ జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజునే ఇళ్ల పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ ఊరికి 75 ఇళ్లు మంజూరు చేశారు. ఆగాపల్లి-18, ఆంబోత్ తండా-11, ఆరుట్ల-73, అస్మత్‌పూర్-11, బండలేమూర్-21, బోడకొండ-27, చీదేడ్-10, చెన్నారెడ్డిగూడ-16, చిత్తాపూర్-15, దాద్‌పల్లి-14, జాపాల్-23, కాగజ్‌ఘట్-08, కొర్రంతండా-05, లోయపల్లి-43, మంచాల-45, నోముల-19, పటేల్ చెరువుతండా-11, రంగాపూర్-11, సత్తితండా-06, తాళ్లపల్లిగూడ-05, తిప్పాయిగూడ-11, ఎల్లమ్మ తండా-16 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు తెలిసింది.

కత్తి మీద సాము

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. ఇళ్లు మాత్రం ఆశించిన స్థాయి ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో ఆశావహుల్లో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం మాత్రం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎలాంటి అవకతవకలు లేకుండా నిజమైన అర్హులను గుర్తించడానికి ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు. వీరు పరిశీలన చేసి నిజమైన అర్హులను గుర్తించాలి. అదే ప్రస్తుతం కత్తి మీద సాములా మారింది.

అధికారుల నిమగ్నం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదోడి సొంతింటి కల నెరవేరింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకంపై శ్రద్ధ చూపలేదు. దీంతో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రస్తుత ప్రభుత్వంలోనైనా లబ్ధి చేకూరాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగానే ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఇచ్చిన నివేదికను పరిశీలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఇల్లు ఇవ్వండి



మాకు గతంలో కూడా ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు కాలేదు. ప్రస్తుతం ఉండడానికి చాలా ఇబ్బందిగా ఉంది. ప్రజాపాలనలో దరఖాస్తు కూడా పెట్టుకున్నాం. వాస్తవాలను పరిశీలన చేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి.

– శ్రీకాంత్, అర్జీదారు, జాపాల

అర్హులందరికీ ఇవ్వాలి



గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు కట్టుకునే ప్రతి ఒక్కరికి మంజూరు చేయాలి. ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో కాలయాపన చే యడం సరైంది కాదు. పేదలను ప్రోత్సహించి సొంతింటి కల నేరవేర్చాలి. అక్రమాలకు తావు లేకుండా చూడాలి.

– జంగయ్య, సీపీఎం మండల కార్యదర్శి

పూర్తి స్థాయిలో విచారణ

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో పూర్తి స్థాయిలో విచారణ అనంతరం లబ్ధిదారులను ప్రకటిస్తాం. ఇందిరమ్మ కమిటీతో పాటు ప్రత్యేకాధికారులు, జిల్లా స్థాయి అధికారులు పరిశీలన చేసి తుది జాబితాను విడుదల చేస్తారు. సందేహాలు చెందొద్దు. అర్హులకు కచ్చితంగా వస్తాయి.

– అనంతరెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం



ఆర్మీకి సంఘీభావంగా విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ

ఆమనగల్లు: పహల్గాం దాడులకు ప్రతీకారంగా భారత భద్రతా బలగాలు పాక్ ఉగ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు నిర్వహించడంపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్ అన్నారు. దేశ ప్రధాని మోదీ, భారత త్రివిద దళాలకు ప్రజలంతా అండగా ఉన్నారన్నారు. పట్టణంలో బుధవారం భారత ఆర్మీకి మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, విక్రంరెడ్డి, రాంపాల్‌నాయక్, శ్రీకాంత్‌సింగ్, చెన్నకేశవులు, కృష్ణయాదవ్, నర్సింహ, లక్ష్మణ్, రవిరాథోడ్, ప్రశాంత్, శ్రీనివాస్, విష్ణుచారి, వెంకటయ్య, మహేశ్, మల్లేశ్, భరత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీ

ఉగ్రవాదుల నిర్మూలన లక్ష్యంగా భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పట్టణంలో బుధవారం సాయంత్రం వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రధాన రహదారిపై భారత జాతీయ పతాకాలను చేతబూని నినదించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

- 28న చలో కలెక్టరేట్ కార్యక్రమం
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జగన్



రాయపోల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్ డిమాండ్ చేశారు. ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన మేడే ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాయపోల్ గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. పని చేసే ప్రదేశంలో కూలీలకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గడ్డపార, రవాణా, నీటి చార్జీలు ఇవ్వడం లేదన్నారు. క్రమంగా బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు తగ్గిస్తూ.. ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. కూలీల సంఖ్య పెరుగుతుంటే పనిదినాలను పెంచకుండా తగ్గిస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్లో రూ.రెండున్నర లక్షల కోట్లు ఈ పథకానికి కేటాయించాలని, ప్రతి కూలీకి ఏడాదిలో 200 రోజుల పనిదినాలను కల్పించాలని, రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికై ఈనెల 28 చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టుతున్నట్లు ప్రకటించారు. పెద్ద సంఖ్యలో కూలీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, యాదయ్య, నర్సింహ, చరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన అవసరం



మంచాల: మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామ్‌ప్రకాశ్ తదితరులు

మంచాల: పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రామ్‌ప్రకాశ్, బి.పద్మజ సూచించారు. బుధవారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. యూరియా వాడకంలో మెలకువలు తప్పక పాటించాలన్నారు. అవసరం మేరకే రసాయనాలు వినియోగించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనప్పుడు తప్పక రసీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణమోహన్, ఏఈఓలు సాయివాణి, లింగస్వామి, నిఖిత, పరిశోధన విద్యార్థులు రాజశేఖర్, పార్వతి, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

మాడ్గుల: భూసారం దెబ్బ తినకుండా సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రవీన్, మురళి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో- శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అరుణకుమారి, అధికారులు జోత్స్న, భార్గవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: వండర్‌లా సమీపంలో సైరన్ మోత కార్యక్రమంలో అధికారులు



ఇబ్రహీంపట్నం: ప్రజలను అలర్ట్ చేస్తున్న అధికారులు

మోగిన సైరన్


- పలు చోట్ల మాక్ డ్రిల్
- హాజరైన అధికారులు, పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్, వండర్‌లా సమీపంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. దాదాపు 50 ఏళ్ల క్రితం ఉపయోగించిన సైరన్ మళ్లీ మోగించారు. సైరన్ మోగిన వెంటనే ప్రజలు స్పందించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. వండర్‌లా సమీపంలో డీఆర్‌ఓ సంగీత, భూసేకరణ అధికారి రాజు, ఏఓ సునీల్, ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేష్‌లు పాల్గొన్నారు. బొంగ్లూర్‌లో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డి, ఎస్‌ఐ బాల్‌రాజ్ తదితరులు భాగస్వాములు అయ్యారు.

అప్రమత్తం చేసిన అధికారులు

ఇబ్రహీంపట్నం: పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు బుధవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో పోలీసులు సైరన్ మోగించి అలర్ట్ చేశారు. అనుకోని ఉపద్రవం ఏదైన ముంచుకోస్తే ప్రజలు ఏ విధంగా వ్యవహరించాలో మానసికంగా సన్నద్ధం చేసేందుకు సైరన్‌తో అలర్ట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, ఏసీపీ రాజు, సీఐ జగదీశ్‌తోపాటు పలువురు అధికారులు రోడ్లపైకి వచ్చి సైరన్ మోతను పరిశీలించారు.

రైతులకు అన్ని వసతులు కల్పిస్తాం



మార్కెట్‌యార్డులో రైతులతో కలిసి భోజనం చేస్తున్న గీత

ఆమనగల్లు: రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత పేర్కొన్నారు. పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం ఆమె రైతులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు ఆకలితో ఇబ్బందులు పడకుండా ఉండటానికి సొంత ఖర్చుతో భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మార్కెట్లో నీటిని అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీశైలం, పాండురంగయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు నారాయణరెడ్డి, మల్లయ్య, ప్రసాద్, కరీం, రఫీ, విజేందర్, నాజర్, మహేశ్, శివ, గౌస్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



ఆమనగల్లు: వాసవీమాత దోలారోహణంలో మహిళా భక్తులు



ఇబ్రహీంపట్నం: అలంకరణలో అమ్మవారు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ఈశ్వరాంజనేయ దేవాలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని వైభవంగా బుధవారం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి అభిషేకం, హోమం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. స్థానికులే కాకుండా చుట్టుముట్టు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వైభవంగా దోలారోహణం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, శ్రీ లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తుల ఆధ్వర్యంలో వాసవీమాతకు డోలారోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాండయ్య, శ్రీరామదూత పీఠాధిపతి శివానందస్వామి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, సభ్యులు నర్సింహ, కుమారస్వామి, వాసు, శ్రీనివాస్, రవీంద్రానంద్, మల్లేశ్, రమేశ్, ప్రతాప్, కిశోర్, లక్ష్మయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో సమ న్యాయం

తలకొండపల్లి: కులగణనతో అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేబినెట్‌లో కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో బీసీలకు మేలు జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టడానికి ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె నోటీస్ అందజేత

కందుకూరు: ఈ నెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని తెలుపుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. నెలకు రూ.26వేలు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.3వేలతోనే సరిపెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులకు పాఠశాలల్లో అప్పులు చేసి వంటలు చేయాల్సి వస్తుందని, సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల హక్కులు కాపాడుకునేలా సమ్మెలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు గీత, బాలమణి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బడంగ్‌పేట్: సామాజిక న్యాయ సాధనలో భాగంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ పరిధిలో 127 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ప్రజల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, కమిషనర్ సరస్వతి, మాజీ కార్పొరేటర్లు రాంరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

మాడ్గుల: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లేబర్స్ కోడ్స్‌ను రద్దు చేసి, కార్మికుల హక్కులు సాధించుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రిలో ఆశ వర్కర్లతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.